RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 78 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శనివారం | 19.09.2026 | పేజీలు : 8

కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రెండోరోజూ సర్వే..

- 388 ఎకరాలపై అధికారుల దృష్టి

- కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాల్లో రెండో రోజు ముగిసిన భూ సర్వే
- సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో 388 ఎకరాలపై అధికారుల దృష్టి
- మూడు గ్రామాల సరిహద్దుల్లోని భూముల గుర్తింపు, పరిశీలన
- పాత రైతుల వివరాలు, రెవెన్యూ రికార్డుల సేకరణ



నిత్యం నిఘా, ఎర్రవల్లి : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే రెండో రోజూ కొనసాగింది. సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని ఫామ్‌హౌస్‌ను ఆనుకొని ఉన్న భూములను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, వర దరాజపూర్ గ్రామాల సరిహద్దుల్లో విస్తరించి ఉన్న సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూములపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. గురువారం ఈ మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన బృందాలు, రెండో రోజైన శుక్రవారం ఆ భూములకు సంబంధించిన పాత రైతుల వివరాలను, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను సేకరించాయి. ఏడీ సుదర్శన్ రాథోడ్, డీఐ సేవియా నాయక్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు ఈ సర్వే ప్రక్రియను నిర్వహించాయి. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, రెవెన్యూ రికార్డుల ఆధారంగా అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఈ సర్వే చేపట్టడానికి గల కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.



22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం.. హైలెవల్ కమిటీ!

- సమస్యలకు చెక్ పెట్టడమే లక్ష్యం - సీఎం రేవంత్

- చైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ చైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా ..... » 2



దానం నాగేందర్‌కు హైకోర్టులో షాక్..

- ఎమ్మెల్యేగా అనర్హత వేటు..!

- 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత వర్తింపు
- స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం
- కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ
- పలేటి, కౌశిక్‌రెడ్డి వేర్వేరు పిటిషన్లు
- ఖైరతాబాద్ స్థానం ఖాళీగా అయినట్లు స్పష్టీకరణ



నిత్యం నిఘా, హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మార్పు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఆయనపై అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు తప్పుబట్టింది. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23 నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడిగా పరిగణించాలని స్పష్టం చేసింది. దానం నాగేందర్ 2023 తెలంగాణ అసెంబ్లీ.. » 2



17 ఏళ్ల బాలికపై మైనర్ల రేప్ ఆపై మర్డర్..

మృతదేహాన్ని కుక్కలు పీక్కుతున్న దుస్థితి!

- నిర్మానుష్య ప్రాంతంలో బాలిక మృతదేహం
- శవం పూర్తిగా కుళ్లిపోవడంతో కష్టమైన గుర్తింపు
- అనుమానాస్పద టెంపోను సీసీటీవీ ఆధారంగా గుర్తింపు
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా వెలుగులోకి ఘోరం
- కత్తులు, రక్తపు మరకలున్న దుస్తుల స్వాధీనం » 2

ఏళ్ల నిరీక్షణకు తెర.. టీజీఎస్ఆర్టీసీలో న్నికల నగారా

- అక్టోబర్ 9న పోలింగ్, 17న ఓట్ల లెక్కింపు
- విడుదలైన ఆర్టీసీ ఎన్నికల పూర్తి షెడ్యూల్
- 2016లో చివరిసారిగా జరిగిన ఎన్నికలు
- కార్మికుల వేతనాలపై చర్చించే అధికారం గుర్తింపు సంఘానికే

వివరాలు 2 లో

నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరైన కేటీఆర్

- ఫార్ములా ఈ-రేసు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేటీఆర్
- కోర్టుకు హాజరైన కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కిరణ్ మల్లేశ్వరరావు
- రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ అభ్యంతరాలు » 2



చెబితే నేనే భోజనం పెట్టి పాలం చూపించేవాడ్ని : హరీశ్ రావు



- సిద్దిపేటలో తన భూముల పరిశీలనపై హరీశ్ రావు స్పందన
- వస్తున్నారని చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్య
- 3,000 మంది పోలీసుల మోహరింపుపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన హరీశ్
- తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో ప్రకటించానని స్పష్టీకరణ » 2



సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం - బండి సంజయ్

- భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే భూములు స్వాధీనం చేసుకోవాలన్న బండి
- కేసీఆర్ కు పుట్టుకతోనే వందల ఎకరాలు లేవనే విషయం అర్థమవుతోందని వ్యాఖ్య
- కేసీఆర్ గతమంతా అవినీతి, భూదందాలతో నిండిపోయిందని ఆరోపణ » 2

సోలార్ స్టార్టప్‌లో గూగుల్, బిల్ గేట్స్ పెట్టుబడి.. రోబోలతో ఫామ్‌ల నిర్మాణం!

- రోబోలతో సోలార్ ఫామ్స్ నిర్మించే స్టార్టప్‌లో భారీ పెట్టుబడులు
- గూగుల్, బిల్ గేట్స్ ఫండ్‌తో పాటు 31.8 మిలియన్ డాలర్ల నిధులు
- కొత్త టెక్నాలజీతో రెట్టింపు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

నిత్యం నిఘా, డెస్క్ : సౌర విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్న ఒక స్టార్టప్‌పై టెక్ దిగ్గజాలు పెట్టుబడుల వర్షం కురిపించాయి. రోబోల సహాయంతో అత్యంత వేగంగా సోలార్ ఫామ్‌లను నిర్మించే కాలిఫోర్నియాకు చెందిన 'ప్లాంటెడ్' అనే స్టార్టప్ తాజాగా 31.8 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 265 కోట్లు) నిధులను సమీకరించింది. ఈ పెట్టుబడులు పెట్టిన వారిలో గూగుల్, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌కు చెందిన 'బ్రేక్‌త్రూ ఎనర్జీ వెంచర్స్' వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉండటం .. 2



22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..

హైలెవల్ కమిటీ!

మొదటిపేజీ తరువాయి.. పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది. ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.

దానం నాగేందర్‌కు హైకోర్టులో షాక్..

- ఎమ్మెల్యేగా అనర్హత వేటు!

మొదటిపేజీ తరువాయి.. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనలను ఆయన ఉల్లంఘించారని పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించినప్పటికీ.. సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ 2026 మార్చి 11న పిటిషన్లను తిరస్కరించిందని పేర్కొన్నారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం చీఫ్ జస్టిస్ ధర్మాసనం స్పీకర్ నిర్ణయంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తాజా తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిన విషయాన్ని స్పీకర్, ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాల్సి ఉంటుంది. దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును తొలుత సెప్టెంబర్ 16న వెలువరించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే.

ఏళ్ల నిరీక్షణకు తెర..

టీజీఎస్ఆర్టీసీలో ఎన్నికల నగారా

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఎట్టకేలకు విడుదలైంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం కార్మిక సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, యాజమాన్యం ఎట్టకేలకు తేదీలను ఖరారు చేసింది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించి, అక్టోబర్ 17న ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆర్టీసీలో చివరిసారిగా 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి 2018లోనే ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రభుత్వం వీటిని జరపలేదు. దీంతో కార్మికుల నిరీక్షణ సుదీర్ఘంగా కొనసాగింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి గుర్తింపు పొందే సంఘానికే కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనల వంటి కీలక అంశాలపై యాజమాన్యంతో మరియు ప్రభుత్వంతో అధికారికంగా చర్చలు జరిపే హక్కు ఉంటుంది. అందుకే ఈ ఎన్నికలను కార్మిక సంఘాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. రాష్ట్ర, రీజనల్ స్థాయిలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. రీజనల్ స్థాయిలో ఆఫీసర్ హోదాలో ఉన్నవారు మినహా, మిగిలిన కార్మికులు, ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తాజా షెడ్యూల్ విడుదలవడంతో ఆర్టీసీలో ఎన్నికల సందడి మొదలైంది.

సోలార్ స్టార్టప్‌లో గూగుల్, బిల్ గేట్స్ పెట్టుబడి..

రోబోలతో ఫామ్‌ల నిర్మాణం!

మొదటిపేజీ తరువాయి.. గమనార్హం. సాధారణంగా సోలార్ ఫామ్‌లను నిర్మించాలంటే భూమిని చదును చేయడం అత్యంత ఖర్చుతో కూడిన, నెమ్మదిగా సాగే ప్రక్రియ. అయితే, ప్లాంటెడ్ సంస్థ రోబోలను ఉపయోగించి ఎగుడుదిగుడుగా ఉన్న సహజసిద్ధమైన భూభాగాల్లో కూడా సులభంగా సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తోంది. ప్రతి ప్యానెల్‌కు రోబోలు విడివిడిగా స్తంభాలను అమరుస్తాయి, తద్వారా భూమిని చదును చేయాల్సిన అవసరం ఉండదు. ఈ వినూత్న విధానం ద్వారా తక్కువ విస్తీర్ణంలోనే రెట్టింపు విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని, నిర్మాణ సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని కంపెనీ వెల్లడించింది. గత ఏడాది 10 మెగావాట్ల ప్రాజెక్టులను పూర్తి చేసిన ఈ సంస్థ, ఈ ఏడాది 100 మెగావాట్ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే దాదాపు 20 గిగావాట్లకు పైగా ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇటీవలే ఒక డేటా సెంటర్ కోసం కేవలం 10 నెలల కాలంలోనే 28 మెగావాట్ల ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసింది. తాజాగా సమీకరించిన నిధులతో తమ రోబోల సంఖ్యను పెంచుకోవడంతో పాటు, 'సేజ్' అనే తర్వాతి తరం రోబోను ఈ ఏడాదిలోనే లాంచ్ చేయాలని ప్లాంటెడ్ యోచిస్తోంది. డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో, వేగవంతమైన సౌర విద్యుత్ ఉత్పత్తికి డిమాండ్ పెరగడంతో ఇటువంటి సాంకేతికతలకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది.

నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరైన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో నమోదైన కేసు విచారణకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు కూడా న్యాయస్థానం ముందుకు వచ్చారు. గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ కోసం హెచ్ఎండీఏ నిధుల నుంచి సుమారు రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండా, ఆర్థిక నిబంధనలు, ప్రామాణిక విధివిధానాలను ఉల్లంఘించి ఈ నిధులను కేటాయించారనే ఆరోపణలతో దర్యాప్తు సంస్థ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఏసీబీ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు, నిందితులకు ఇదివరకే సమన్లు జారీ చేసింది. గత విచారణ సమయంలో కేటీఆర్ వ్యక్తిగత కారణాల వల్ల మినహాయింపు కోరగా, విచారణ ఈనాటికి వాయిదా పడటంతో ఆయన ప్రత్యక్షంగా హాజరయ్యారు.

సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

- బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి.. సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని : హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి.. సిద్దిపేటలోని తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. "ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.



17 ఏళ్ల బాలికపై మైనర్ల రేప్ ఆపై మర్డర్..

మృతదేహాన్ని కుక్కలు పీక్కుతున్న దుస్థితి!

మొదటిపేజీ తరువాయి.. దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి, కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని స్వరూప్ నగర్‌లోని ఓ బహిరంగ ప్రదేశంలో పడేశారు. కొన్ని రోజుల తర్వాత అక్కడ మృతదేహం లభ్యమైంది. కుషక్ రోడ్ సమీపంలోని పొలాల్లో మృతదేహం పడి ఉందని సెప్టెంబర్ 13 ఉదయం పోలీసులకు సమాచారం అందింది. మృతదేహం తీవ్రంగా కుళ్లిపోవడంతో తొలుత బాధితురాలి లింగాన్ని కూడా ఫోరెన్సిక్ బృందాలు వెంటనే నిర్ధారించలేకపోయాయి. పోలీసుల ప్రకారం.. బాలికకు నిందితులతో ముందే పరిచయం ఉంది. వారంతా ఓ టెంపోలో కలిసి మద్యం సేవించిన తర్వాత బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మృతదేహంలో కొంత భాగాన్ని వీధి కుక్కలు తినేశాయని పోలీసులు తెలిపారు. ఓ చేయి మృతదేహానికి దూరంగా పొలంలో లభించినట్లు చెప్పారు. బాలిక కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదు. ఆమె తరచూ ఇంటి నుంచి వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చేదని కుటుంబ సభ్యులు పోలీసులకు చెప్పినట్లు సమాచారం. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు 50కుపైగా సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ టెంపోను గుర్తించారు. చీకటి, తక్కువ వెలుతురు కారణంగా తొలుత వాహనం నంబర్ స్పష్టంగా కనిపించలేదు. చివరకు టెంపోను ఖడ్డా కాలనీలో గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను విచారించగా మరో ముగ్గురి వివరాలు బయటపడ్డాయి. దీంతో 16 నుంచి 17 ఏళ్ల వయసున్న ముగ్గురు మైనర్లతో పాటు శివమ్ అలియాస్ సుదామాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించినట్లు అనుమానిస్తున్న రెండు కత్తులు, నిందితులు ధరించిన రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరెవరైనా ఉన్నారా? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 6 కింద కేసు నమోదు చేశారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భార్యలకు పదవులు..
భర్తలకు పెత్తనాలు!

❖ రిజర్వేషన్ మహిళలకు రాజకీయ అవకాశం కల్పిస్తే.. తెరవెనుక అధికారం భర్తలదేనా?

❖ మహిళా ప్రజాప్రతినిధుల స్వతంత్రతపై తాడ్వాయి మండలంలో చర్చ.. అధికారుల తీరుపైనా ప్రశ్నలు

ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 18(నిత్యం నిఘా ప్రతినిధి): మహిళలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించేందుకు అమలు చేస్తున్న రిజర్వేషన్లు కొందరి వ్యవహారశైలితో తమ లక్ష్యాన్ని కోల్పోతున్నాయనే విమర్శలు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో వినిపిస్తున్నాయి. కొందరు రాజకీయ నాయకులు రిజర్వేషన్ కారణంగా తమ భార్యలను ఎన్నికల బరిలో నిలబెట్టి గెలిపించిన అనంతరం, ప్రజల ముందున్న పదవి భార్యదైనా.. తెరవెనుక వ్యవహారాలన్నీ భర్తలే చక్కబెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికలకు ముందు పెద్దగా ప్రజాక్షేత్రంలో కనిపించని మహిళలు, రిజర్వేషన్ కారణంగా అభ్యర్థులుగా తెరపైకి వస్తున్నారని, ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా వారి తరఫున భర్తలే రాజకీయ, అధికార వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ‘‘పదవి భార్యది.. పెత్తనం భర్తది’’ అనే చర్చ మొదలైంది.

రిజర్వేషన్ ఉద్దేశం ఇదేనా

మహిళలకు రాజకీయ సాధికారత కల్పించడం, నిర్ణయాధికారంలో వారి భాగస్వామ్యాన్ని పెంచడం కోసం రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పటికీ, ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధి స్వయంగా నిర్ణయాలు తీసుకోకుండా భర్త లేదా కుటుంబ సభ్యులు ఆమె స్థానంలో వ్యవహరిస్తే రిజర్వేషన్ అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మహిళ కేవలం పదవిలో ఉండే పేరు మాత్రమే, అధికార వ్యవహారాల్లో మాత్రం మరొకరు చక్రం తిప్పే పరిస్థితి ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఎంతవరకు అనుకూలమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కాంట్రాక్టులు.. బిల్లులు.. రాజకీయ ప్రయోజనాల కోసమేనా?

కొంతమంది మహిళా ప్రజాప్రతినిధుల పదవులను అడ్డుపెట్టుకుని వారి భర్తలు కాంట్రాక్టు పనులు, బిల్లులు, ప్రభుత్వ పథకాలు తదితర వ్యవహారాల్లో ప్రభావం చూపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పదవి లేకుంటే తమ పనులు, కాంట్రాక్టులు, రాజకీయ ప్రయోజనాలకు ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతోనే భార్యలను ఎన్నికల్లో నిలబెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే ఇవి స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణలేనని, నిర్దిష్ట వ్యక్తులు లేదా సంస్థలపై ఆరోపణలు నిజమని నిర్ధారించాలంటే సంబంధిత ఆధారాలు, అధికారిక వివరాలు అవసరమని ప్రజలు గుర్తించాలని పలువురు సూచిస్తున్నారు.

అధికారుల పాత్రపైనా చర్చ

మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో భర్తలు అధికారులతో వ్యవహరిస్తున్న సందర్భాల్లో, కొందరు అధికారులు కూడా వారికి ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల్లో గెలిచినది మహిళా ప్రజాప్రతినిధి అని తెలిసినప్పుడు, అధికారిక వ్యవహారాల్లో ఆమెకే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉండగా పదవిలో లేని భర్తలకు అదే స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వడం ఎందుకనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అధికారులు నిబంధనల ప్రకారం ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనే అధికారికంగా వ్యవహరించాలని, వ్యక్తిగత రాజకీయ సంబంధాల ప్రభావానికి లోనుకాకూడదని ప్రజలు కోరుతున్నారు.

ఓటు వేసే ముందు ఆలోచించాలి



ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థి ఎవరి భార్య లేదా కుటుంబ సభ్యురాలు అనే విషయాన్ని మాత్రమే కాకుండా, ఆమెకు ప్రజా సమస్యలపై అవగాహన ఉందా? ఇంతకుముందు ప్రజాక్షేత్రంలో పనిచేసిందా? ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగలదా? ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా కృషి చేయగలదా? అనే అంశాలను ఓటర్లు పరిశీలించాలని పలువురు సూచిస్తున్నారు. అభ్యర్థి వ్యక్తిగత నేపథ్యం, ప్రజాసేవా అనుభవం, రాజకీయ అవగాహన గురించి తెలుసుకున్న తర్వాతే ఓటు వేయాలని అంటున్నారు.

డబ్బు రాజకీయాలపై విమర్శలు

ఎన్నికల్లో డబ్బు ప్రభావం పెరుగుతోందని, అధికంగా ఖర్చు చేయగలిగినవారికే రాజకీయ అవకాశాలు దక్కుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఖర్చు చేసిన డబ్బును తిరిగి రాబట్టుకోవాలనే ఉద్దేశంతో పదవులను ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేసిన ప్రతి అభ్యర్థి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తాడని సాధారణీకరించలేమని, అలాంటి ఆరోపణలకు నిర్దిష్ట ఆధారాలు అవసరమని ప్రజాస్వామ్య పరిశీలకులు చెబుతున్నారు.

ఏ రిజర్వేషన్ వస్తే.. ఆ వర్గానికే చెందిన భార్య?

రిజర్వేషన్ రాజకీయాల్లో మరో చర్చ కూడా సాగుతోంది. ఏ వర్గానికి రిజర్వేషన్ లభిస్తే ఆ వర్గానికి చెందిన భార్యను ఎన్నికల బరిలోకి దింపి, ఆమె పేరుతో కుటుంబ రాజకీయ ప్రయోజనాలను కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇలా రిజర్వేషన్లను మహిళా సాధికారతకు కాకుండా కుటుంబ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగిస్తే వాటి లక్ష్యం ప్రశ్నార్థకంగా మారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మార్పు ఎక్కడి నుంచి రావాలి ?

మహిళలను ఎన్నికల్లో గెలిపించడం మాత్రమే సాధికారత కాదని, గెలిచిన తర్వాత వారు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించడమే అసలైన సాధికారత అని ప్రజలు అంటున్నారు.

పదవి ఎవరి పేరుతో ఉందో.. అధికారం కూడా వారిదే ఉండాలి.

ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధుల అధికార పరిధిని గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులతో పాటు ప్రభుత్వ అధికారులపైనా ఉందని పేర్కొంటున్నారు. తాడ్వాయి మండలంలో వినిపిస్తున్న ఈ చర్చను కేవలం ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా, మహిళా రిజర్వేషన్ల అమలు, కుటుంబ రాజకీయ జోక్యం, ప్రజాప్రతినిధుల స్వతంత్రత వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

హెచ్ఐవీపై అపోహలు వీడాలి

- అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యం
- హన్మకొండలో అవగాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

హన్మకొండ, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఆకుపచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హెచ్ఐవీపై అవగాహన లేమితో సమాజంలో పలు అపోహలు వ్యాప్తిలో ఉన్నాయని, వాటిని తొలగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న వైద్య సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ



చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టడంలో ముందస్తు జాగ్రత్తలు, సరైన అవగాహనే కీలకమని తెలిపారు.అవగాహన ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు చేతబూని ఎయిడ్స్ నివారణపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

మహంకాళి వీధిలో ఘనంగా కుంకుమ పూజ మహోత్సవం

- శ్రీ లక్ష్మీ గణపతి పరపతి సంఘంలో ప్రత్యేక పూజలు
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న కాలనీవాసులు



వరంగల్, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ నగరంలోని 42వ డివిజన్ పరిధిలో రంగసాయిపేట మహంకాళి వీధిలోని శ్రీ లక్ష్మీ గణపతి పరపతి సంఘం ఆధ్వర్యంలో కుంకుమ పూజ మహోత్సవం, నిత్య పూజ కార్యక్రమాలను కాలనీవాసులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విలాసాగరం విశ్వనాథ్, పాల నాగరాజు, కుమ్మరి కృష్ణమూర్తి, పంగా సాయిరాం, పాకాల చక్రపాణి, పాల రంజిత్, కత్తెరపల్లి శ్రీనివాస్, పెండట సోమరాజు, అంబటి రమేష్, ముప్పసాగర్ కేడలా అశ్విన్‌తో పాటు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సక్రు నాయక్‌కు ఘన సన్మానం

- విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేష కృషి అభినందనీయం
- కాటాపురం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సత్కారం



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండలం కాటాపూర్ జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సక్రు నాయక్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా కాటాపురం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కాటాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ దిడ్డి మోహన్ రావు, పంచా యతీ కార్యదర్శి కోరం భాగ్యరాణి పాఠశాలకు వెళ్లి సక్రు నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్క రించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భం గా సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు మాట్లాడుతూ.. కాటాపురం విద్యార్థుల విద్యాభివృద్ధికి సక్రు నాయక్ అందిస్తున్న సేవలు ఎంతో విలువైనవని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆయన చేస్తున్న కృషి అభి నందనీయమని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం కాటాపురం గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాణాల సుధాకర్, ఉపాధ్యాయులు జయపాల్, హిందీ ఉపాధ్యాయుడు, గణిత ఉపాధ్యాయులు, రాసూరి సంజీవ్, ఇతర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు పాల్గొని సక్రు నాయక్‌కు అభినందనలు తెలిపారు.

కాటాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం

- విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేసిన సర్పంచ్
- పరిశుభ్రమైన వాతావరణంతోనే ఆరోగ్యకరమైన సమాజం



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల పరిధిలోని కాటాపురం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ‘స్వచ్ఛతా హి సేవ–స్వచ్ఛతమే సేవ’ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కోరం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోహన్‌రావు మాట్లాడుతూ.. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచిన ప్పుడే ప్రజల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని అన్నారు. ‘ఆరోగ్యమే మహాభాగ్యం’ అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని స్వచ్ఛభారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కాలుష్యరహిత పాఠశాలగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ స్వయంగా విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి కోరం భాగ్యలక్ష్మి , పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాణాల సుధాకర్, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పక్కనే చెత్త కుప్పలు

- 57వ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణపై స్థానికుల ఆగ్రహం
- దుర్వాసనతో ఇబ్బందులు.. వ్యాధుల భయంతో ప్రజలు



హనుమకొండ, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నగరంలోని 57వ డివిజన్‌లో శ్మశాన వాటికకు ఆనుకుని భారీగా చెత్త కుప్పలు పేరుకుపోవ డంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో రోజుల తరబడి కుప్పలు పేరుకుపోయి ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. చెత్త కుప్పల కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని ప్రజలు చెబుతున్నారు. దీనివల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శ్మశాన వాటికకు వచ్చే ప్రజలు, అటుగా వెళ్లే బాటసారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతూ ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడకముందే బల్దియా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. చెత్తను ప్రతిరోజూ సకాలంలో తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరి శీలించి పారిశుద్ధ్య సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధి పనులపై సర్వసభ్య సమావేశం

- గ్రామాల సమస్యలు, రైతుల అంశాలపై విస్తృత చర్చ
- ప్రజాప్రతినిధులు–అధికారుల సమన్వయంతో అభివృద్ధికి కృషి



పెద్దపల్లి జిల్లా/మంథని, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివిధ గ్రామాల సర్పంచులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ శాఖల అధికారులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, రైతులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, సంబంధిత శాఖల అధికారులు వాటి పరి ష్కారానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ రంగానికి సంబం ధించిన అంశాలతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై సమావే శంలో చర్చ జరిగింది. గ్రామాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

జీవో 97 రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన

- ములుగు రోడ్డు కూడలిలో బైఠాయించి ఆందోళన
- ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులకు ఇబ్బందులు



హన్మకొండ, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): పాలిటెక్నిక్ విద్యార్థులకు నష్టం కలిగించేలా ఉన్న జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హన్మకొండలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శుక్రవారం భారీ నిరసన చేపట్టారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో ములుగు రోడ్డు కూడలికి చేరుకుని రహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం, విద్యాశాఖ వైఖరికి వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. భారీ సంఖ్యలో విద్యార్థులు రహదారిపై బైఠాయించడంతో ప్రధాన మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. నిత్యం రద్దీగా ఉండే ములుగు రోడ్డు కూడలిలో వాహనదారులు ఇబ్బందులు ఎదు ర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో చర్చించారు. విద్యార్థులు లేవనెత్తిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమిం చారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. జీవో 97ను రద్దు చేసే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థి నాయకులు తెలిపారు. తమ డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గణనాథుని సన్నిధిలో భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజ

- ప్రత్యేక పూజలు నిర్వహించిన కౌన్సిలర్ ఎరుకల స్రవంతి – రమేష్‌బాబు దంపతులు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



పెద్దపల్లి జిల్లా/మంథని, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా మంథని మండలం గంగాపురి గ్రామంలో అంబేద్కర్ యూత్ గజానన్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో శుక్రవారం కుంకుమ పూజ కార్యక్ర మాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి, రమేష్‌బాబు దంపతులు గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి ఆశీస్సు లతో గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషా లతో జీవించాలని వారు ఆకాంక్షించారు. గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని గణనాథుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ గజానన్ మండలి సభ్యులు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దీంతో గణేష్ మండపం భక్తులతో సందడిగా మారింది.

మరియాపురంలో లీడర్ శిక్షణ కార్యక్రమం

- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాయకత్వ నైపుణ్యాలపై శిక్షణ



వరంగల్/మరియాపురం, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): మరియాపురంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లీడర్ శిక్షణ కార్య క్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నాయకత్వ లక్షణాలు, సేవా కార్యక్రమాల నిర్వహణ, సమాజానికి మరింత సమర్థవంతంగా సేవలందించే అంశాలపై ఈ శిక్షణలో అవగా హన కల్పించనున్నారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా. కరుణశ్రీ, కార్యదర్శి సురేష్, కోశాధికారి లతతో పాటు ఐ.పీ.డి.జి. డా. కె. చంద్రశేఖర్ ఆర్య, డా. రాజేశ్వరి ఆర్య, ఎక్టెన్షన్ చైర్మన్ మార్గం ప్రభాకర్, డా. వెలూరి శారద, డా. నాగవాణి, రేడియో వ్యాఖ్యాత సంతోషి ఉపాధ్యాయ వక్తలుగా పాల్గొని వివిధ అంశాలపై శిక్షణ, మార్గదర్శనం అందించను న్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతినిధులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవా లని నిర్వాహకులు కోరారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

జీలుగులలో రాశి స్వీట్ పత్తి ప్రదర్శన

- ఆధునిక వంగడాలపై రైతులకు అవగాహన
- సుమారు 300 మంది రైతులు పాల్గొన్న క్షేత్ర ప్రదర్శన





హన్మకొండ/ఎల్కతుర్తి, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి మండలం జీలుగుల గ్రామంలో ఆధునిక పత్తి వంగడాలపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా రాశి సీడ్స్ ఆధ్వర్యంలో రాశి స్వీట్ పత్తి రకం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు సమ్మిరెడ్డి చేనులో ఏర్పాటు చేసిన ప్రదర్శన క్షేత్రాన్ని రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాశి స్వీట్ పత్తి రకం ప్రత్యేకతలు, సాగు విధానం, దిగుబడి సామర్థ్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. రాశి సీడ్స్ ఆర్‌సీఎం ప్రమోద్, టీఎస్ఎం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. రాశి స్వీట్ పత్తి రకం తక్కువ కాలంలో పంట చేతికి వచ్చేలా ఉండటంతో పాటు అధిక దిగుబడికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. పచ్చదోమ, తెల్లదోమ వంటి రసం పీల్చే పురుగులను తట్టుకునే సామర్థ్యం ఈ రకానికి ఉందని వివరించారు. తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడి సాధించేందుకు ఈ పత్తి రకం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పంట త్వరగా చేతికి రావడం వల్ల రైతులు తదుపరి పంటను సకాలంలో సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా భూమిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు వ్యవసాయ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు ఆధునిక పత్తి వంగడాలపై అవగాహన పెంచుకుని శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీఓలు పి. హరీష్, గడ్డి శ్రీనివాస్, రాజ శేఖర్‌రెడ్డి, చందుతో పాటు జీలుగుల, వల్లభాపూర్, కోతులనడుమ, జగన్నాథపూర్, మాణిక్యపురం, గోపాల్‌పూర్ తదితర గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులు పాల్గొన్నారు.

శివాలయం వద్ద వైభవంగా కుంకుమ పూజ

- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న మహిళలు
- ఆధ్యాత్మిక సందడితో కళకళలాడిన 11వ డివిజన్



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 11వ డివిజన్ శివాలయం వద్ద శుక్రవారం భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. శివాలయం కాకతీయ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆలయ పూజారి రామగిరి దేవేంద్రాచారి సారథ్యంలో కుంకుమ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సమృద్ధులు కలగాలని భక్తులు ప్రార్థించారు. మహిళల ఆధ్యాత్మిక సందడితో శివాలయ ప్రాంగణం కళకళలాడింది. కార్యక్రమాన్ని శివాలయం కాకతీయ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి సిలివేరు శ్రీధర్ యాదవ్, కోశాధికారి మైస వీరేందర్, సలహాదారు గబ్బేట అశోక్, ఉపాధ్యక్షులు ఎడ్ల రాజురెడ్డి, సిలివేరు రాజుకుమార్ యాదవ్, సహాయ కార్యదర్శి కుదురుపాక ప్రసాద్, ఎడ్ల మల్లికార్జున్‌రెడ్డితో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కోల అనిల్, బేతి అశోక్ యాదవ్, బేతి సందీప్ యాదవ్, ఎడ్ల రజనీకర్‌రెడ్డి, రాజ బోయిన అశోక్ యాదవ్, బొమ్మెరబోయిన ప్రభాకర్ యాదవ్, కామ వెంకటేష్, బొమ్మెరబోయిన రాజు యాదవ్, సిలివేరు వేణు యాదవ్, బేతి సోమన్న యాదవ్, తోట భాను ప్రకాష్, సిలివేరు ఇంద్రకుమార్ యాదవ్, మాడిశెట్టి తరుణ్, సిలివేరు ముఖేష్ యాదవ్, ఎం.డి. గౌస్, సిలివేరు హర్షవర్ధన్ యాదవ్, సిలివేరు భరద్వాజ్ యాదవ్, కుదురుపాక సాత్విక్, మిరియాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు. కుంకుమ పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగడంతో శివాలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

ఎస్సీ కమిటీల నిర్మాణంపై వరంగల్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు

- రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సంస్థాగత నిర్మాణంపై ప్రజెంటేషన
- గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీల ఏర్పాటుపై చర్చ



వరంగల్, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం సంస్థాగత నిర్మాణంలో భాగంగా వరంగల్ జిల్లాలో చేపట్టిన కమిటీల ఏర్పాటుపై గాంధీభవన్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యవర్గ సమావేశంలో ప్రజెంటేషన్ ఇచ్చారు. వరంగల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ జిల్లాలో చేపట్టిన కమిటీల నిర్మాణ ప్రక్రియకు సంబంధించిన వివరాలను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. సమావేశానికి ఏఐసీసీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విభాగాల సమన్వయకర్త, మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజు, రాష్ట్ర ఎస్సీ విభాగం ఇన్‌చార్జి సిద్ధార్థ హతియంబిరే హాజరయ్యారు. తెలంగాణ పీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిలువేరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలో గ్రామ, మండల, పట్టణ స్థాయిల్లో ఎస్సీ విభాగం కమిటీల ఏర్పాటుకు చేపట్టిన చర్యలను వివరించారు. కమిటీ సభ్యుల పేర్లు, గ్రామాలు, వారికి అప్పగించిన బాధ్యతలు, ఫోన్ నంబర్లతో కూడిన వివరాలను నమోదు చేస్తూ సంస్థాగత నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. కమిటీల ఏర్పాటు సందర్భంగా ఎదురైన ఇబ్బందులు, వివిధ స్థాయిల్లో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ ప్రక్రియను కొనసాగించిన తీరును కూడా సమావేశంలో వివరించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తలను పార్టీ కార్యక్రమాలతో అనుసంధానం చేయడం, సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేయడంపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. సామాజిక న్యాయం, అంబేద్కర్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా క్షేత్ర స్థాయిలో సంస్థాగత కార్యక్రమాలను కొనసాగించాలని నాయకత్వం సూచించినట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో చేపట్టిన కమిటీల నిర్మాణంపై శ్రీనివాస్ ఇచ్చిన ప్రజెంటేషన్‌పై రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు అభినందనలు తెలిపినట్లు ఆయన వెల్లడించారు. తన పనితీరును నాయకత్వం గుర్తించడం సంతోషంగా ఉందని పేర్కొంటూ, ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీ షాపు యజమాని ఆత్మహత్య

నయీంనగర్‌లో విషాద ఘటన.. కారణాలపై పోలీసుల దర్యాప్తు



హనుమకొండ, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నయీంనగర్‌లో ఫ్లెక్సీ షాపు యజమాని పెద్దబోయిన గణేష్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. షాపులో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. గణేష్‌కు భార్య రమ్యశ్రీ, ఇద్దరు కుమార్తెలు తన్ను సాయిశ్రీ, సాయిస్ఫూర్తి ఉన్నారు. కష్టపడి పనిచేసే వ్యక్తిగా గణేష్‌ను స్థానికులు పేర్కొన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తులు విషాదంలో మునిగిపోయారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన అకిరాకు ఆర్థిక సాయం

- ఫీజు కోసం రూ.10 వేల తక్షణ సాయం అందించిన నిమ్మని శేఖర్‌రావు
- విద్యకు పేదరికం అడ్డు కావొద్దు



వరంగల్, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించిన కొండేటి అకిరాకు ఫీజు చెల్లింపులో అండగా నిలిచేందుకు సీనియర్ న్యాయవాది, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్‌రావు ముందుకొచ్చారు. అకిరా తల్లిదండ్రులకు రూ.10 వేల తక్షణ ఆర్థిక సాయాన్ని అందించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచన మేరకు ఈ ఆర్థిక సహాయం అందించినట్లు నిమ్మని శేఖర్‌రావు తెలిపారు. పేదరికంలో ఉంటూనే పట్టుదలతో చదివి అకిరా ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆమె వైద్య విద్యకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో తన వంతు సహాయంగా రూ.10 వేల సాయం అందించినట్లు పేర్కొన్నారు. "విద్యకు పేదరికం ఎప్పటికీ అడ్డు కావొద్దు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి. అకిరా భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదగాలి. ఆమెకు నా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి" అని నిమ్మని శేఖర్‌రావు ఆకాంక్షించారు. ఎంబీబీఎస్ సీటు సాధించినప్పటికీ ఫీజు చెల్లింపుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో అందిన ఈ సాయం అకిరా కుటుంబానికి కొంత ఊరటనిచ్చింది. ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు సమాజం అండగా నిలిస్తే వారు తమ లక్ష్యాలను చేరుకునేందుకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పలువురు పేర్కొన్నారు.

యువతకు 75 రోజుల ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ

- భూపాలపల్లిలో డేస్ స్కాలర్ కోచింగ్ ప్రారంభం
- రాత పరీక్షతో పాటు శారీరక దారుఢ్యంపై దృష్టి పెట్టాలి: ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



భూపాలపల్లి, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకుని భూపాలపల్లి జిల్లా యువతకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 75 రోజుల ఉచిత డేస్ స్కాలర్ శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న జిల్లా యువతకు ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పొందుతూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా యువత పోలీస్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో నాణ్యమైన శిక్షణ అందించేందుకు 75 రోజుల ఉచిత డేస్ స్కాలర్ కోచింగ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగం సాధించడం ద్వారా యువతకు మంచి భవిష్యత్తుతో పాటు కుటుంబాలకు ఆర్థిక భరోసా, సమాజంలో గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం చేస్తున్న కృషి భవిష్యత్తులో కుటుంబ పరిస్థితులను మార్చగలదని యువతను ప్రోత్సహించిన ఎస్పీ.. శిక్షణను సీరియస్‌గా తీసుకుని క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. రాత పరీక్షతో పాటు శారీరక దారుఢ్యానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. 75 రోజుల శిక్షణను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని ఎక్కువ మంది యువత పోలీస్ ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలతో పాటు భూపాలపల్లి జిల్లాకు గర్వకారణంగా నిలవాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, భూపాలపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ సంపత్‌రావు, సీఐలు, ఎస్ఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సీఎం రేవంత్‌రెడ్డికి గుండు సుధారాణి కృతజ్ఞతలు

- కుడా చైర్‌పర్సన్‌గా నియమించినందుకు ధన్యవాదాలు
- వరంగల్ తూర్పు నియోజకవర్గం, నగర అభివృద్ధిపై సీఎంతో చర్చ



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్‌పర్సన్‌గా నియమితులైన గుండు సుధారాణి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనను కుడా చైర్‌పర్సన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. శాలువాతో ముఖ్యమంత్రిని సత్కరించారు. కుడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ముఖ్యమంత్రిని కలిసిన సుధారాణి.. వరంగల్ తూర్పు నియోజకవర్గంతో పాటు వరంగల్ నగర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఆయనతో చర్చించారు. నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పట్టణ మౌలిక వసతుల అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కుడా పరిధిలోని అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సుధారాణి ఇటీవల అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే.

ఉద్యమకారుల ఓదార్పు యాత్రకు కొనసాగింపు

- మలి దశ ఉద్యమకారులకు ఘన సన్మానం
- తెలంగాణ అమరుల కుటుంబాలకు పరామర్శ



వరంగల్, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారుల ఐక్యత, ఆత్మగౌరవం, సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన ఉద్యమకారుల ఓదార్పు యాత్ర రెండో రోజు కొనసాగింది. ఇందులో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వద్ద మలి దశ ఉద్యమకారులు ఎం.డి. అజీమ్, అఫ్జల్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉర్సు ప్రాంతానికి చెందిన ఉద్యమకారులు గడ్డం యుగంధర్, పసునూరి రమేశ్‌లను సత్కరించారు. అక్కడి నుంచి రంగశాయిపేటలోని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ భవనానికి చేరుకున్న యాత్ర బృందం వరంగల్‌కు చెందిన సీనియర్ ఉద్యమకారులు మండల పరశురాములు, శంకేశివ లింగమూర్తి, పరికిపండ్ల ఈశ్వరయ్య, డాక్టర్ బొమ్మగాని కుమారస్వామి, గుండు సదానందం, కొమ్మలపాటి పూర్ణకుమార్, వానమామలై కృష్ణదేవాచార్య, అనుమాస్ కామేష్, సోమ మనోహర్, గురిమిల్ల వేణు, ఎం.డి. వహీద్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది, ఉద్యమ నేత గుడిమళ్ల రవికుమార్‌ను ఉద్యమకారులు ఘనంగా సన్మానించారు. అనంతరం గుర్మాజీపేట ఉద్యమ అమరులు నర్రా బద్రి, కొగిలవై శ్రీనివాస్, పాపన్న ముదిరాజ్ కుటుంబాల ఇళ్లకు వెళ్లి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గుడిమళ్ల రవికుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుదీర్ఘకాలం సాగిన ఉద్యమంలో అమరులైన వారు, జైలు పాలైన వారు, గాయపడిన వారు, కేసులు ఎదుర్కొన్న వారు, బైండోవర్లు అయిన వారు, క్రియాశీలకంగా పాల్గొన్న వారందరినీ ప్రభుత్వం శాస్త్రీయంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంఖ్యను అధికారికంగా ప్రకటించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం కమిటీని నియమించడం మంచి పరిణామమని పేర్కొన్న ఆయన.. గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి ఉద్యమకారులను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియలో జాప్యం జరిగితే ఉద్యమకారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దశాబ్దాలపాటు సాగిన తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులను ఆదరించి, ఓదార్చిన వారు లేకపోవడం బాధాకరమని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ ఫలితాలను అనుభవిస్తున్న వారు సైతం ఉద్యమకారులను విస్మరించారని, ఉద్యమ పోరాటంతో రాజకీయ అధికారాన్ని పొందిన నాయకులు కూడా ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం పూర్తవుతున్నా ఉద్యమకారుల సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. ఉద్యమకారుల ఐక్యత, ఆత్మగౌరవం, సంక్షేమమే లక్ష్యంగా ఓదార్పు యాత్రను కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు ఆచ విద్యాసాగర్, రాష్ట్ర ఇన్‌చార్జి వాడపల్లి శ్యాంకృష్ణ, రాష్ట్ర తొలి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొల్లిశెట్టి అశోక్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ అలీ, రామబ్రహ్మాచారి, చాంద్ పాషా, చెన్నూరి నటరాజ్, కోడల ప్రసాద్, రాజమౌళి, మాధవీలత, స్వర్ణలత, పద్మ, మొగుసల దేవేందర్‌రెడ్డి, అహ్మద్, తౌటం సమ్మయ్య, జినుకుల లక్ష్మణ్, మేకల కృష్ణ, మేకల రవీందర్, ఇమ్మడిశెట్టి రాజు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు పాల్గొన్నారు.

గణనాథుడికి 360 కిలోల భారీ లడ్డూ సమర్పణ

- గణనాథుడికి 360 కిలోల భారీ లడ్డూ సమర్పణ



వరంగల్/సంగెం, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): సంగెం మండలం మణికంఠ కాలనీలో గణనాథుడికి 360 కిలోల భారీ లడ్డూను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భయ్యా ఫిష్ మార్ట్ అధినేత భయ్యా అశోక్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక లడ్డూను తయారు చేయించి వినాయకుడికి సమర్పించారు. అశోక్ కుటుంబ సభ్యులు తమ ఇంటి నుంచి లడ్డూను ప్రత్యేక శోభాయాత్రగా గణపతి మండపం వద్దకు తీసుకువచ్చారు. డీజే సంగీతం మధ్య జరిగిన శోభాయాత్రలో కాలనీవాసులు, మొండ్రాయి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ లడ్డూను గణనాథుడికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ఎం జిల్లా కోశాధికారి మచ్చిక వెంకటేశ్వర్లు, గుంటి రవి, కలకొండ సుమన్, సాగర్, శ్రీనివాస్, భయ్యా ఫిష్ మార్ట్ సిబ్బంది పాల్గొని లడ్డూ సమర్పణ కార్యక్రమంలో సహకరించారు. అశోక్ కుటుంబ సభ్యులు శ్రీనివాస్, ప్రభాకర్, బుచ్చిబాబు, అశోక్, కుమార్తె కళావతి తదితరులు పాల్గొన్నారు. భారీ లడ్డూ సమర్పణ సందర్భంగా గణపతి మండపం వద్ద భక్తుల్లో ప్రత్యేక ఉత్సాహం నెలకొంది.

కాటాపురం రామాలయంలో మహా అన్నదానం

- గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు.. స్వామివారి ఆశీస్సులు పొందిన ప్రజలు







ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండలం కాటాపురం గ్రామంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాటాపురంతో పాటు బీరెల్లి, గంగారం, నర్సాపురం, దామరవాయి గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాన కార్యక్రమానికి ముందు ఆలయంలో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గాదె సదానందం చారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు ఆధ్యాత్మిక భావంతో కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో సర్పంచి దిద్దె మోహన్‌రావు, ఆలయ నిర్మాణ కర్త, మాజీ సర్పంచి పులి పెద్ద నరసయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ దానుక నర్సింగరావు, మేడిశెట్టి సులోచన, మాజీ ఎంపీటీసీ ముండ్రాతి రాజశ్రీ, చిట్టినేని శ్రీనివాస్, పల్లెర్ల మహేశ్వరాచారి, కుసుమ వెంకటేశ్వర్లు, దిద్దె రంజిత్, సయ్యద్ హుస్సేన్, వహీద్, దిద్దె సూర్యం తదితర ముఖ్య నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

- కరీంనగర్ పోలీస్ కమిషనర్‌తో కలిసి పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



కరీంనగర్/జమ్మికుంట, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ పరిధిలో నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. నిమజ్జన మార్గాలు, భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు పోలీసు, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ దిలీప్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్న భక్తులు నిమజ్జన కార్యక్రమాన్ని కూడా అదే భక్తిభావంతో ప్రశాంతంగా విజయవంతం చేయాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన మార్గాల్లో అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ప్రజలు పోలీసు, మున్సిపల్ అధికారులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు శాఖ తరఫున పూర్తి బందోబస్తు, అవసరమైన సహకారం అందిస్తామని అధికారులు తెలిపారు. నిమజ్జన మార్గాలు, భక్తుల రాకపోకలు, భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్, కౌన్సిలర్లు, పట్టణ సీఐ, మున్సిపల్ ఏఈ వికాస్, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, నాలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

- ఎఫ్‌టీఎల్ మార్కింగ్ పూర్తి చేయాలి
- సాగునీటిపారుదల, కుడా, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలి




హనుమకొండ, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా మార్కింగ్ చేయాలని సూచించారు. శుక్రవారం ఖిలా వరంగల్‌లోని గుండు చెరువు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణకు ఏర్పాటు చేసిన చెరువుల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల్లోని చెరువులు, కుంటలు, నాలాల విస్తీర్ణం, ప్రస్తుత పరిస్థితి, పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. చెరువులు, కుంటలు, నాలాలను నోటిపై చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. ప్రతి నాలాకు సంబంధించిన క్షేత్రస్థాయి నివేదికను సాగునీటిపారుదల శాఖ అధికారులు అందజేయాలని సూచించారు. చెరువులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ నోటిఫికేషన్ జారీకి ముందు క్షేత్రస్థాయి నివేదికలు కీలకమని పేర్కొన్నారు. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ పరిధిని క్షేత్రస్థాయిలో స్పష్టంగా గుర్తించి మార్కింగ్ చేయాలని, చెరువు శిఖం భూములు ఆక్రమణలకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాలా కన్వర్షన్ చేసే సమయంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిశీలన నిర్వహించాలని సూచించారు.చెరువులు, నాలాల పరిరక్షణ విషయంలో సాగునీటిపారుదల, కుడా, రెవెన్యూ, సర్వే, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లు స్పష్టం చేశారు. భవిష్యత్‌లో చెరువులు, కుంటలు, నాలాలపై ఆక్రమణలు, అనధికార మార్పులకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, వరంగల్ జిల్లా అటవీ అధికారి బి.నిఖిత, కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, డీఆర్ఓ విజయలక్ష్మి , వరంగల్ ఆర్డీఓ సుమ, భూముల కొలతల శాఖ ఏడీ నూర్‌సింగ్, సాగునీటిపారుదల శాఖ ఈఈలు మంగీలాల్, కిరణ్‌కుమార్, కుడా ఈఈ భీమ్‌రావు, సీపీఓ రవీంద్ర రాడేకర్, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భార్యాభర్తలు.. బంధం కాదు, బలమైన భరోసా

- ఇంటికి వచ్చిన భర్తకు భార్య ఆప్యాయత..
- అలసిన భార్యకు భర్త అండ.. ఇదే సంతోష కరమైన సంసారం



(నిత్యం నిఘా) : ఉదయం ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టినప్పటి నుంచి రాత్రి తిరిగి ఇంటికి చేరే వరకు మనిషి ఎన్నో పరిస్థితులను ఎదుర్కొంటాడు. ఉద్యోగం, వ్యాపారం, ఆర్థిక ఇబ్బందులు, సమాజంలో ఎదురయ్యే ఒత్తిళ్లు.. ఇలా ఎన్నో అంశాలు మనసును అలసిపోయేలా చేస్తాయి. అలాంటి సమయంలో ఇంటి గుమ్మం దాటగానే ఎదురయ్యే భార్య చిరునవ్వు, ఆప్యాయమైన పలకరింపు, రెండు ప్రేమ మాటలు రోజంతటి అలసటను మరిచిపోయేలా చేస్తాయి. అయితే కుటుంబంలో ప్రశాంతత అనేది భార్య ఒక్కరి బాధ్యత కాదు. ఇంటి బాధ్యతలను మోస్తూ రోజంతా శ్రమించే భార్యకు కూడా భర్త ప్రేమ, అండ, సహకారం అవసరం. భర్త బయట కష్టపడుతుంటే.. భార్య ఇంటిని నడిపిస్తూ కష్టపడుతుంది. ఇద్దరి కష్టం వేరు కావచ్చు.. కానీ కుటుంబం కోసం చేసే త్యాగం మాత్రం ఒక్కటే.

గొడవలు సహజమే.. పరిష్కారం ముఖ్యం

భార్యాభర్తల మధ్య అభిప్రాయ భేదాలు రావడం అసాధారణం కాదు. అయితే ఆ గొడవ ఎంతసేపు కొనసాగుతుంది.. అది ఎంత పెద్ద సమస్యగా మారుతుంది అనేది వారి ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుంది. చిన్న విషయాలను పెద్దవిగా చేసుకోవడం కంటే ఒకరి మనసును మరొకరు అర్థం చేసుకోవడం ముఖ్యం. కోపంలో గెలిచిన మాట.. ప్రేమలో ఓడిపోయిన బంధంగా మారకూడదు. అందుకే ఆవేశంలో మాట్లాడకుండా కొంత సమయం తీసుకుని ప్రశాంతంగా చర్చించుకోవాలి. భార్యకు ఉన్న సమస్యలను భర్త వినాలి.. భర్తకు ఉన్న ఒత్తిడిని భార్య అర్థం చేసుకోవాలి. ఒకరి మాటను మరొకరు మధ్యలో ఆపకుండా వినడం కూడా దాంపత్య జీవితంలో గొప్ప గుణమే.

ఎప్పుడు.. ఎలా చెప్పాలో తెలుసుకోవాలి

భర్త ఇంటికి వచ్చిన వెంటనే భార్య తన సమస్యలను చెప్పకూడదని కాదు. తన సమస్యలను పంచుకునే హక్కు ఆమెకు ఉంది. అదే విధంగా భర్త కూడా తన బాధలను భార్యతో పంచుకోవాలి. అయితే ఎప్పుడు చెప్పాలి.. ఎలా చెప్పాలి.. ఏ మాటలో చెప్పాలి అనే అవగాహన ఉంటే ఎన్నో కుటుంబ సమస్యలు మొదలయ్యే ముందే పరిష్కారమవుతాయి. దాంపత్య బంధంలో ఖరీదైన బహుమతుల కంటే చిన్న చిన్న ఆప్యాయతలకే ఎక్కువ విలువ ఉంటుంది. ఉదయం ప్రేమగా పలకరించడం.. పని నుంచి వచ్చినప్పుడు "ఎలా ఉన్నావు?" అని అడగడం.. అలసిపోయినప్పుడు ఒక గ్లాసు నీళ్లు అందించడం.. భార్య చేసిన పనిని గుర్తించి ప్రశంసించడం.. భర్త చేసిన కష్టాన్ని గుర్తించి ధన్యవాదం చెప్పడం.. ఇవే కుటుంబంలో ప్రేమను పెంచే చిన్న అడుగులు.

గౌరవమే బంధానికి పునాది

పిల్లల ముందే ఒకరినొకరు అవమానించకుండా ఉండటం, ఇతరుల ముందు భాగస్వామి గౌరవాన్ని కాపాడటం, ఆర్థిక విషయాల్లో పరస్పరం చర్చించుకోవడం, కుటుంబ నిర్ణయాల్లో ఇద్దరి అభిప్రాయాలకు విలువ ఇవ్వడం దాంపత్య బంధాన్ని మరింత బలపరుస్తాయి. సంతోషంలో పక్కన నిలిచేవారు చాలామంది ఉంటారు.. కానీ కష్టంలో చేయి పట్టుకునే వ్యక్తే నిజమైన జీవిత భాగస్వామి. జీవితంలో సమస్యలు రాకుండా ఉండటం సాధ్యం కాదు. అయితే సమస్య వచ్చినప్పుడు భార్యాభర్తలు ఒకరికొకరు ఎదురుగా నిలబడకుండా.. ఒకే వైపు నిలబడి సమస్యను ఎదుర్కొంటే కుటుంబ బంధం మరింత బలపడుతుంది.

ఇల్లు అంటే ప్రేమ.. నమ్మకం.. భరోసా

ఇల్లు అంటే కేవలం గోడలు, తలుపులు, వస్తువులు కాదు. అక్కడ నివసించే మనుషుల మధ్య ఉండే ప్రేమ, నమ్మకం, ఆప్యాయతలే నిజమైన ఇల్లు. భర్తకు భార్యలో ప్రశాంతత కనిపించాలి.. భార్యకు భర్తలో భరోసా కనిపించాలి. అందుకే భార్యాభర్తలు "నువ్వు నా కోసం ఏం చేశావు?" అని ప్రశ్నించుకోవడం కంటే.. "నీ కోసం నేను ఏం చేయగలను?" అని ఆలోచించాలి. "ఎవరు గెలిచారు?" అనే దానికంటే.. "మన బంధం గెలిచిందా?" అనేదే ముఖ్యమని గుర్తించాలి. ఎందుకంటే మంచి సంసారం అంటే సమస్యలు లేని జీవితం కాదు.. సమస్యలు వచ్చిన ప్రతిసారీ ఒకరి చేతిని మరొకరు వదలకుండా కలిసి ముందుకు సాగే జీవితం. భార్యాభర్తలు జీవిత భాగస్వాములు మాత్రమే కాదు.. జీవిత ప్రయాణంలో ఒకరికొకరు బలమైన భరోసా.

చెరువులు, నాలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు

- ఎఫ్‌టీఎల్ మార్కింగ్ పూర్తి చేయాలిసాగునీటిపారుదల, కుడా, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలి



హనుమకొండ, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా మార్కింగ్ చేయాలని సూచించారు. శుక్రవారం ఖిలా వరంగల్‌లోని గుండు చెరువు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణకు ఏర్పాటు చేసిన చెరువుల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల్లోని చెరువులు, కుంటలు, నాలాల విస్తీర్ణం, ప్రస్తుత పరిస్థితి, పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. చెరువులు, కుంటలు, నాలాలను నోటిఫై చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. ప్రతి నాలాకు సంబంధించిన క్షేత్రస్థాయి నివేదికను సాగునీటిపారుదల శాఖ అధికారులు అందజేయాలని సూచించారు. చెరువులు, కుంటలకు ఎఫటఃీల నోటిఫికేషన్ జారీకి ముందు క్షేత్రస్థాయి నివేదికలు కీలకమని పేర్కొన్నారు. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ పరిధిని క్షేత్రస్థాయిలో స్పష్టంగా గుర్తించి మార్కింగ్ చేయాలని, చెరువు శిఖం భూములు ఆక్రమణలకు గురికాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాలా కన్వర్షన్ చేసే సమయంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పరిశీలన నిర్వహించాలని సూచించారు.చెరువులు, నాలాల పరిరక్షణ విషయంలో సాగునీటిపారుదల, కుడా, రెవెన్యూ, సర్వే, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్లు స్పష్టం చేశారు. భవిష్యత్‌లో చెరువులు, కుంటలు, నాలాలపై ఆక్రమణలు, అనధికార మార్పులకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, వరంగల్ జిల్లా అటవీ అధికారి బి.నిఖిత, కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, డీఆర్ఓ విజయలక్ష్మి , వరంగల్ ఆర్డీఓ సుమ, భూముల కొలతల శాఖ ఏడీ నూర్‌సింగ్, సాగునీటిపారుదల శాఖ ఈఈలు మంగీలాల్, కిరణ్‌కుమార్, కుడా ఈఈ భీమ్‌రావు, సీపీఓ రవీంద్ర రాడేకర్, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో మున్సిపల్ కార్మికుల నిరసన

- మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేత



కరీంనగర్/జమ్మికుంట, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): జమ్మికుంట మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌క ుమార దిలీప్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య తనిఖీ అధికారి ఇల్లందుల రమేశ్ విధులకు కొంతమంది కౌన్సిలర్లు, వారి కుటుంబ సభ్యుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ కార్మికులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. పారిశుధ్య కార్యాలయంలోకి తరచూ వెళ్లడం, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, కార్మికులు, వాహనాలను ఫొటోలు తీయడం, పారిశుధ్య తనిఖీ అధికారిని ఇబ్బందులకు గురిచేయడం వంటి ఆరోపణలు తన దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు.

విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక

ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామితో మాట్లాడి, సంబంధిత ఉద్యోగితో పాటు ఫిర్యాదు చేసిన వారితో సమగ్రంగా విచారణ జరిపిస్తామని చైర్మన్ తెలిపారు. అవసరమైతే కరీంనగర్ జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఎవరినీ తప్పుబట్టడం తమ ఉద్దేశం కాదని, అయితే మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల విధులకు ఎలాంటి ఆటంకం కలిగినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

జమ్మికుంట పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో మున్సిపల్ కార్మికుల పాత్ర కీలకమని చైర్మన్ అన్నారు. కార్మికులు విధులు ముగించుకున్న అనంతరం విశ్రాంతి తీసుకోవడంతో పాటు బండ్లు, పనిముట్లు భద్రపరుచుకునేందుకు శానిటేషన్ కార్యాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. సిబ్బందికి సంబంధించిన కార్యాలయంలోకి వెళ్లి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఏదైనా తనిఖీ చేయాల్సి ఉంటే ముందుగా మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించి, సంబంధిత అధికారుల సమక్షంలో నిర్వహించుకోవచ్చని సూచించారు.



ఆర్టీఐ ద్వారా సమాచారం పొందవచ్చు

మున్సిపాలిటీకి సంబంధించిన వాహనాలు, డీజిల్ వినియోగం, జీపీఎస్ వివరాలు, ఇతర అధికారిక సమాచారం తెలుసుకోవాలనుకునే వారు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకుని వివరాలు పొందవచ్చని చైర్మన్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేయకుండా చట్టబద్ధమైన మార్గాల్లో సమాచారాన్ని పొందాలని సూచించారు. మున్సిపల్ ఉద్యోగులపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, విధులకు ఆటంకం కలిగించినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ జరిపిస్తామని చెప్పారు. విచారణలో కౌన్సిలర్లు లేదా ఇతరులు తప్పు చేసినట్లు తేలితే నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. పారిశుధ్య తనిఖీ అధికారి ఇల్లందుల రమేశ్, మున్సిపల్ కార్మికులకు పూర్తి మద్దతు ఉంటుందని, ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా విధులు నిర్వర్తించాలని చైర్మన్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గణనాథుని సన్నిధిలో భక్తులకు అన్నదానం

- జంజర్ల మమత — సతీష్ దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ
- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు



పెద్దపల్లి జిల్లా/మంథని, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని గంగాపురి అంబేద్కర్ యూత్ గణపతి మండపం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని జంజర్ల మమత–సతీష్ దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దంపతులు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించి అందించారు. ఈ సందర్భంగా జంజర్ల మమత–సతీష్ దంపతులు మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో తమ కుటుంబంలో అష్టైశ్వర్యాలు, పాడిపంటలు, పాడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. గణనాథుని సన్నిధిలో భక్తులకు అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని, సేవా కార్యక్రమం నిర్వహించే అవకాశం లభించడం తమకు దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవకాశం కల్పించిన అంబేద్కర్ యూత్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గణనాథుని ఆశీస్సులు అంబేద్కర్ యూత్ యువకులతో పాటు వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఘనంగా స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో గణనాథునికి పూజలు



నిత్యం నిఘా, ఇబ్రహింపట్నం, సెప్టెంబర్ 13 : ఇబ్రహింపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామానికి చెందిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టమల్ల శ్రీశైలం దంపతులు స్వామి వివేకానంద యూత్ గణనాథునికి శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ,ప్రతి ఏటా వినాయక చవితి వేడుకలు ప్రతి ఏటా ఘనంగా జరుపుకుంటామని అన్నారు భక్తిశ్రద్ధలతో పాటలు భజన కార్యక్రమాలు కోలాటలు నిర్వహిస్తామని తెలిపారు.గణనాథుని ఆశీస్సులు ప్రజల పై ఎల్లవేళలా ఉండాలని వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని కోరు కున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.రామకృష్ణ,భాస్కర్, బన్నీ ప్రణతి, లక్ష్మీ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఊకె శేఖర్ రావు.



నిత్యం నిఘా, ఇల్లందు, సెప్టెంబర్ 18 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టేకులపల్లి మండల అధ్యక్షులు ఆంగోత్ సంతులాల్ ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ఆదారేషన్ కలిగి ఉన్న ప్రతి రేషన్ డీలర్ల సభ్యత తీసుకోవాలని ఈ సభ్యత్వం వల్ల డీలర్ కుండే ఉపయోగాలను ఆయన వివ రించారు ఈ కార్యక్రమంలో.జిల్లా అధ్యక్షులు ఊకె శేఖర్ రావు. అజ్మీర రామ గూగుల్ ఏం చందర్ గోగ్గల కళ్యాణ్.సోలం రాంబాబు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

వికలాంగుడికి చేయూత : నర్సింగ్ పల్లిలో లబ్ధిదారునికి ఛార్జింగ్ సైకిల్ అందజేత



నిత్యం నిఘా, నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 18 : వికలాంగుల సంక్షేమా నికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, వారి ముఖాల్లో చిరునవ్వులు నింపడమే లక్ష్యంగా పాలన సాగుతోందని నర్సింగ్ పల్లి సర్పంచ్ తెడ్డు సుగుణ రాజేశ్వర్ అన్నారు.సిరికొండ మండలం నర్సింగ్ పల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు మాద నర్సింగ్ రావుకు స్థానిక ఎమ్మెల్యే భూపతి రెడ్డి ప్రత్యేక కృషి ఫలితంగా ముఖ్యమంత్రి సి.ఎం. రేవంత్ రెడ్డి మంజూరు చేసిన 'ఛార్జింగ్ సైకిల్'ను సర్పంచ్ తెడ్డు సుగుణ రాజేశ్వర్ శుక్రవారం ఘనంగా అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వికలాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించేందుకు ఈ ఛార్జింగ్ సైకిళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పేదలు, దివ్యాంగుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే భూపతి రెడ్డికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఛార్జింగ్ సైకిల్ అందుకున్న లబ్ధిదా రుడు మాద నర్సింగ్ రావు ఆనందం వ్యక్తం చేస్తూ.. "తనలాంటి వికలాంగులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తూ, అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే భూపతి రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు" తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రావణకుమార్, పంచాయతీ కార్యదర్శి పాషా, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాయిత ప్రశాంత్, గ్రామ నాయకులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత వైద్య సాయం

- **తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు ఆర్థిక సహాయం**
- **డాక్టర్ అంబేడ్కర్ మెడికల్ ఎయిడ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ హేమంత్ సహదేవరావు**



ములుగు జిల్లా , సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి) : తీవ్రమైన, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన అర్హులైన రోగులు డాక్టర్ అంబేడ్కర్ మెడికల్ ఎయిడ్ పథకం కింద అందించే వైద్య సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు కోరారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ పథకానికి సంబం ధించిన వివరాలను వెల్లడించారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతోందని తెలిపారు. ప్రత్యేక వైద్య చికిత్స లేదా శస్త్రచి కిత్స అవసరమైన ఎస్సీ, ఎస్టీ వర్గాల రోగులకు ఆర్థిక సహాయం అందించడం పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

రూ.5 లక్షల్లోపు కుటుంబ వార్షిక ఆదాయం

పథకం కింద దరఖాస్తు చేసుకునే వ్యక్తి తప్ప నిసరిగా ఎస్సీ లేదా ఎస్టీ వర్గానికి చెందినవారై ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించకూడదని కలెక్టర్ తెలిపారు. గుండె శస్త్రచికిత్సలు, మూత్రపిండ వ్యాధులకు డయాలసిస్, క్యాన్సర్‌కు కీమోథె రపీ, రేడియోథెరపీ, మెదడు శస్త్రచికిత్సలు, మూత్రపిండాలు, కాలేయం తదితర అవయ వాల మార్పిడి, వెన్నెముక శస్త్రచికిత్సలతో పాటు ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సలకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందవ చ్చని వివరించారు. ఆసుపత్రి ధ్రువీకరించిన చికిత్స అంచనా వ్యయంలో నిబంధనల మేరకు వంద శాతం వరకు, ఆయా చికిత్స లకు నిర్ణయించిన గరిష్ఠ పరిమితికి లోబడి సహాయం మంజూరు చేస్తారని తెలిపారు. మంజూరైన మొత్తాన్ని రోగికి నగదు రూపంలో ఇవ్వకుండా, చికిత్స అందించే ఆసుపత్రి బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేస్తారని పేర్కొన్నారు.

గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో చికిత్స

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుబంధ ఆసుపత్రులు, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం గుర్తింపు పొందిన ఆసుపత్రులతోపాటు డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మార్గదర్శకాల ప్రకారం అర్హత పొందిన గుర్తింపు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రోగి ఫొటో, ఆసుపత్రి వైద్య పర్యవేక్షకుడు ధ్రువీకరించిన చికిత్స అంచనా వ్యయం, ప్రతిపాదిత చికిత్స, శస్త్రచి కిత్స తేదీ వివరాలను సమర్పించాలని సూచించారు. అవయవ మార్పిడి చికిత్సకు దరఖాస్తు చేసుకునేవారు అవయవ దాత వివ రాలతోపాటు రోగి, దాత మధ్య బంధుత్వాన్ని నిర్ధారించే ధ్రువపత్రాలను కూడా జతచేయా లని తెలిపారు. ప్రతిపాదిత శస్త్రచికిత్స, డయా లసిస్, కీమోథెరపీ లేదా ఇతర చికిత్స తేదీకి కనీసం 15 రోజుల ముందుగా దరఖాస్తు పంపించాలని కలెక్టర్ సూచించారు. దరఖా స్తులను డైరెక్టర్, డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్, 15, జన్‌పథ్, న్యూఢిల్లీ–110001 చిరునామాకు పంపించాలని తెలిపారు. పథకం మార్గదర్శకాలు, దరఖాస్తు నమూనా, ఇతర వివరాల కోసం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ అధి కారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు. జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ రోగులకు పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదే శించినట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులు నిర్ణీత సమయంలో అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుని వైద్య సహాయం పొందాలని కోరారు.

నోటీసుల విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- **ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలి**
- **ఓటర్ల వివరాల నిర్ధారణలో బూత్ స్థాయి అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి**



ములుగు జిల్లా/వెంకటాపూర్, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవర ణలో భాగంగా జారీ చేసిన నోటీసులపై విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఎన్నికల నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ఓటర్ల వివరా లను నిర్ధారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. శుక్రవారం వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను కృష్ణవేణి తనిఖీ చేశారు. ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులు, జారీ చేసిన నోటీసులు, వాటిపై చేపడుతున్న విచారణ ప్రక్రియను పరిశీలిం చారు. నోటీసులకు సంబంధించిన విచారణను క్షేత్రస్థాయిలో సమగ్రంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావులేకుండా బూత్ స్థాయి అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలనలో వాస్తవాలను నిర్ధారించి, అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ తహసీల్దార్ భవానీ ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పె క్టర్ నగేష్, బూత్ స్థాయి అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీ పునరాభివృద్ధి చేపట్టాలి

- **పేదల కోసం ఇందిరమ్మ టవర్స్ నిర్మించాలి**
- **అసెంబ్లీలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని ప్రస్తావన**
- **సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి**



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పేదలు, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న గృహ సమస్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శాసనసభలో ప్రస్తా వించారు. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలు అందుబాటులో లేకపోవడంతో పలువురు పేదలు సొంత ఇళ్లకు దూర మవుతున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. వరంగల్–హనుమకొండ నగర ప్రాంతంలోని సుమారు 40–50 ఏళ్ల క్రితం నిర్మించిన హౌసింగ్ బోర్డు కాలనీలోని ఇళ్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయని నాయిని తెలిపారు. సుమారు వెయ్యి ఇళ్లతో ఉన్న ఈ కాలనీని ఆధునిక అవసరాలకు అనుగుణంగా పునరాభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాత ఇళ్లను మరమ్మతులు చేయడమా, లేక అవసరమైన చోట వాటిని తొలగించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడమా అనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఒకే ప్రాంతంలో ఎక్కువ కుటుంబాలకు ఇళ్లు అందించేలా బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తే స్థల సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు కాలనీకి కొత్త రూపు వస్తుందని సూచించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని కొందరు లబ్ధిదారులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద నోటీసులు జారీ చేసినప్ప టికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొందరు మొత్తాన్ని చెల్లించలేకపో యారని ఎమ్మెల్యే తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని మరోసారి అవకాశం కల్పించి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని అందించాలని కోరారు. హైదరాబాద్‌లో చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్ తరహాలో రాష్ట్రంలోని కార్పొరేషన్లలో హౌసింగ్ బోర్డు స్థలాలు అందుబాటులో లేని నిరుపేదల కోసం బహుళ అంతస్తుల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నాయిని కోరారు. వరంగల్–హనుమకొండ ప్రాంతానికి కూడా ఇందిరమ్మ టవర్స్ మంజూరు చేసి అర్హులైన పేదలకు సొంత గృహాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలపై గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని కార్పొరేషన్లలో నిరుపేదల కోసం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమం చేపడుతున్నామని, అందులో భాగంగా వరంగల్–హనుమకొండలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీకి సంబం ధించిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అంశాన్ని కూడా పరిశీలించి అవసర మైన చర్యలు తీసుకుంటామని సభలో సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణ హౌసింగ్ బోర్డు హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్ల బహుళ అంతస్తుల గృహాల కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com